• శిగమూగిన దేవరకద్ర

దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు

• గోడైనా ఎక్కాలి.. కేసీఆర్‌ను చూడాలి



మక్తల్‌లోని ఎల్లమ్మకుంట గార్లపల్లి రోడ్డు వద్ద నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్ ప్రసంగాన్ని ఆసక్తిగా వింటున్న ప్రజలు

పాలమూరులో గులాబీ జోష్

- కేసీఆర్ ప్రజాఆశీర్వాద సభలు సక్సెస్
- దేవరకద్ర, గద్వాలలో జనజాతర
- నారాయణపేట, మక్తల్‌కు జనమే జనం
- బీఆర్ఎస్ నేతలు, శ్రేణుల్లో రెట్టింపు ఉత్సాహం
- ప్రతిపక్షాల గుండెల్లో గుబులు

నారాయణపేట/మక్తల్/గద్వాల/దేవరకద్ర, నవంబర్ 6: రహదారులపై జనంబారులు.. తండోపతండాలుగా శ్రేణులు.. బ్యాండు మేళాల చప్పుట్లు.. ఈలలు, కేకలతో కేరింతలు.. గులాబీ జెండాల రెపరెపలు.. జై కేసీఆర్.. జై బీఆర్ఎస్ నినాదాలు.. మొత్తంగా ఉమ్మడి పాలమూరు జిల్లాలో గులాబీ జోష్ నిండింది. దేవరకద్ర, గద్వాల, మక్తల్, నారాయణపేటలో సోమవారం సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలకు జనం పోటెత్తారు. ఎటుచూసినా కిక్కిరిసిపోయారు. మూడు జిల్లాలు, నాలుగు నియోజకవర్గాల్లో జరిగిన ఈ సభలు విజయవంతం అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర నియోజకవర్గ కేంద్రంలో ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హాజరైన సభకు జనం వేలాదిగా తరలివచ్చారు. రాష్ట్ర సాంస్కృతిక, క్రీడ, పర్యాటక, ఎక్సైజ్ శాఖ లమంత్రి శ్రీనివాస్‌గౌడ్, వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్న ఈ సభ ఆద్యంతం ఉత్సాహభరింగా సాగింది. అనంతరం గద్వాలలో ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి కేసీఆర్ పాల్గొన్న సభకు ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నేతలు తండోపతండాలుగా తరలివచ్చారు. బ్యాండ్ మేళాల చప్పుళ్ల నడుమ నృత్యాలు చేస్తూ ప్రాంగణానికి చేరుకున్నారు. దీంతో రోడ్లన్నీ కిక్కిరిసిపోయాయి. ఊహించిన దాని కంటే ప్రజలు స్వచ్ఛందగా అధికంగా సంఖ్యలో తరలిరవడంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో ఉత్సాహం ఉరకలెత్తింది. మక్తల్‌కు ముఖ్యమంత్రి కేసీఆర్ చేరుకోగా స్థానిక ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో సభ జరిగింది. మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డితోపాటు పలువురు కార్పొరేషన్ల చైర్మన్లు, నాయకులు హాజరయ్యారు. మెడలో బీఆర్ఎస్ కండువా, చేతిలో గులాబీ జెండాలతో యువతీ, యువకులు, మహిళలు కేరింతలు కొడుతూ రహదారుల వెంబడి నృత్యం చేశారు. జై తెలంగాణ.. జైజై కేసీఆర్.. చిట్టెం రామన్న నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలతో హోరెత్తించారు. అనంతరం నారాయణపేటకు జననేత కేసీఆర్ చేరుకున్నారు. నారాయణపేట ఎమ్మెల్యే ఎస్ రాజేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈ సభకు ఊహించిన దానికన్నా జనం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు సభ జరగాల్సి ఉండగా ముఖ్యమంత్రి ప్రయాణించాల్సిన హెలికాప్టర్‌లో ఏర్పడిన సాంకేతికలోపంతో నాలుగు గంటలు ఆలస్యంగా వచ్చినప్పటికీ జనం ఓపికతో వేచి ఉండి, కేసీఆర్ ప్రసంగం ముగిసే వరకు ఉండటం విశేషం. ఈలోగా కళాకారులు ఆట పాటలతో అలరించారు.

దేవరకద్ర సభకు హాజరైన సీఎం కేసీఆర్‌కు హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలుకుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి. చిత్రంలో దేవరకద్ర బీఆర్ఎస్ అభ్యర్థి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

దేవరకద్రలో ఏర్పాటు చేసిన ప్రజా ఆశీర్వాద సభలో బీఆర్ఎస్‌లో చేరిన మాజీ జెడ్పీటీసీ సభ్యుడు వెంకటేశ్వర్‌రెడ్డికి గులాబీ కండువా కప్పుతున్న సీఎం కేసీఆర్

సీఎం హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య

- సురక్షితంగా ల్యాండింగ్
- మరో హెలికాప్టర్‌లో పర్యటన

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు ప్రయాణిస్తున్న హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తడంతో అప్రమత్తమైన పైలట్ వెంటనే మార్గమధ్యంలోనే మళ్లించి సురక్షితంగా మ్యాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్నం తన వ్యవసాయ క్షేత్రం నుంచి సీఎం కేసీఆర్ దేవరకద్రకు హెలికాప్టర్‌లో బయలుదేరారు. కాసేపటికే గాలిలో ఉండగానే హెలికాప్టర్‌లో సాంకేతిక సమస్య తలెత్తింది. వెంటనే గుర్తించిన పైలట్ మార్గ మధ్యం నుంచి తిరిగి వ్యవసాయ క్షేత్రానికి హెలికాప్టర్‌ను మళ్లించి సురక్షితంగా దించేశారు. సీఎం కేసీఆర్‌కు మరో ప్రత్యామ్నాయ హెలికాప్టర్‌ను ఏవియేషన్ సంస్థ ఏర్పాటు చేసింది. కొద్దిసేపటి తర్వాత హెలికాప్టర్ రాగానే.. యథావిధిగా దేవరకద్ర పర్యటనకు సీఎం కేసీఆర్ బయలుదేరి వెళ్లారు.

గజ్వేల్‌లో 28న సీఎం కేసీఆర్ సభ

- 2018లోనూ అక్కడే ముగింపు
- 9న గజ్వేల్, కామారెడ్డిలో ముఖ్యమంత్రి నామినేషన్

హైదరాబాద్, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ): గత ఎన్నికల ఫలితాలే ఈసారీ రిపీటవుతాయని ఇప్పటికే స్పష్టమైంది. ఆ ఎన్నికల్లో సీఎం కేసీఆర్ హుస్నాబాద్‌లో సమరశంఖం పూరించి గజ్వేల్‌లో ముగించారు. ఆ ఎన్నికల్లో బీఆర్ఎస్ తిరుగులేని విజయం సాధించింది. ఈసారి కూడా సీఎం కేసీఆర్ అదే ఒరవడి అనుసరిస్తున్నారు. గతనెల 15న హుస్నాబాద్‌లో ప్రజా ఆశీర్వాద సభతో ప్రజల్లోకి వెళ్లారు. ఈ నెల 9న తొలుత గజ్వేల్‌లో నామినేషన్ వేసి అనంతరం కామారెడ్డి చేరుకుంటారు. అక్కడ నామినేషన్ దాఖలు చేసిన అనంతరం ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొంటారు. 28న గజ్వేల్ సభతో ప్రచారాన్ని ముగిస్తారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 88 సీట్లు వచ్చాయి. ఈసారి అంతకుమించి ప్రజలు ఆశీర్వదించి చరిత్రను తిగరాసే వాతావరణం కనిపిస్తున్నది.

అదే జోరు.. అదే ఒరవడి

బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ 2014, 2018 ఎన్నికల సందర్భంగా అనుసరించిన ప్రచార సరళినే ఈసారీ అనుసరిస్తున్నారు. 2018 ఎన్నికల్లో దాదాపు 100 నియోజకవర్గాల్లో ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొని ప్రజలకు చేరువై ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించినట్టే ఈసారి అదే ఒరవడి కొనసాగిస్తున్నారు. ఈసారి 96 నియోజకవర్గాల్లో సీఎం కేసీఆర్ ప్రజలను కలుసుకోనున్నారు. ఎటువంటి సమస్యలు ఎదురైనా సీఎం కేసీఆర్ ముందుగా విడుదల చేసిన షెడ్యూల్‌కు అనుగుణంగా తన కార్యక్రమాలను నిర్వహిస్తారు. ఎదురుచూసే ప్రజలను ఎప్పుడూ నిరాశకు గురిచేయరని గతనెల 30వ తేదీతో పాటు సోమవారం నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభలు నిరూపించాయి.

భీమ్‌గల్‌లో నామినేషన్ దాఖలు కార్యక్రమానికి వచ్చిన అశేష జనవాహినిని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి వేముల

ఆరోపణలు నిరూపిస్తే ముక్కు నేలకు రాస్తా

- నా ఆస్తులు ప్రజలకు రాసిస్తా
- రవాణా శాఖ మంత్రి పువ్వాడ
- ఎన్నికలపుడే వచ్చే వారిని నమ్మొద్దు: నామా

ఖమ్మం, నవంబర్ 6 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): కాంగ్రెస్ ఖమ్మం ఎమ్మెల్యే అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావు తనపై చేసిన ఆరోపణల్లో ఒక్కటి నిరూపించినా ముక్కు నేలకు రాసి క్షమాపణ చేస్తానని, ఆస్తులను ప్రజలకు పంచుతానని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ సవాల్ విసిరారు. ఖమ్మంలోని తెలంగాణ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఖమ్మం ప్రజాఆశీర్వాద సభలో బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్ కరటక, దమనకులని పరోక్షంగా విమర్శించింది కాంగ్రెస్ నేతలైన పొంగులేటి, తుమ్మలేనేనని స్పష్టం చేశారు. చిన్నయసూరి నీతి కథలో కరటక, దమనకులనే రెండు నక్కలకు సంబంధించిందని, ఆ నక్కల అసలు రూపం వారిద్దరేనని అభివర్ణించారు. వారి నటనకు ఆస్కార్ అవార్డు ఇచ్చినా తక్కువేనని ఎద్దేవా చేశారు. బీఆర్ఎస్ లోక్‌సభా పక్షనేత, ఎంపీ నామా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. కేవలం ఎన్నికల సమయంలో ప్రజల మధ్యకు వచ్చే వారిని నమ్మొద్దని పిలుపునిచ్చారు.

ఖమ్మంలో మీడియాతో మాట్లాడుతున్న మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, చిత్రంలో ఎంపీ నామా నాగేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ నీరజ, ఖమ్మం ఏఎంసీ చైర్మన్ శ్వేత

అభివృద్ధి చేసిన.. ఆశీర్వదించండి

- ఓటర్లకు మంత్రి వేముల విజ్ఞప్తి
- భీమ్‌గల్‌లో నామినేషన్ దాఖలు
- భారీగా హాజరైన శ్రేణులు, అభిమానులు

భీమ్‌గల్, నవంబర్ 6: బాల్కొండ నియోజకవర్గ అభివృద్ధి కోసం మనస్సుపెట్టి పని చేశానని, మరోసారి ఆశీర్వదించాలని మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్‌లో నామినేషన్ వేశారు. రాజ్యసభ సభ్యుడు కేఆర్ సురేశ్‌రెడ్డి, ఫ్యామిలీ అండ్ హెల్త్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ మధుశేఖర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎల్ఎంబీ రాజేశ్వర్‌తోపాటు సతీమణి నీరజతో కలిసి రిటర్నింగ్ అధికారి చిత్రమిశ్రాకు నామినేషన్ పత్రాలు అందజేశారు. అంతకు ముందు లింబాద్రిగుట్టపై శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వేముల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం వేలాదిగా తరలివచ్చిన కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీగా భీమ్‌గల్‌కు చేరుకున్నారు. నామినేషన్ వేసిన అనంతరం వేముల వారినుద్దేశించి మాట్లాడారు. ప్రజల కోసం నిబద్ధతతో పనిచేస్తే వారే కడుపులో పెట్టుకొని కాపాడుకుంటారని తాను విశ్వసిస్తానని చెప్పారు. తనను ఆశీర్వదించడానికి వేల సంఖ్యలో స్వచ్ఛందంగా తరలివచ్చిన ప్రజలు, అభిమానులే ఇందుకు నిదర్శనమని తెలిపారు. గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, సాగునీటి రంగంలో విజయాలను సాధ్యం చేసినప్పుడు తనకు కలిగి ఆనందాన్ని వర్ణించలేనిదని ఉద్వేగంగా చెప్పారు. సీఎం కేసీఆర్ రూపొందించిన ఎన్నికల మ్యానిఫెస్టో సకలజనుల సంక్షేమానికి వరంలా ఉన్నదని తెలిపారు. కార్యక్రమంలో జడ్పీ చైర్మన్ విఠల్‌రావ్, క్రిస్టియన్ మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ డీ రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి బండారికి బేతి మద్దతు

- ఉప్పల్‌బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్

ఉప్పల్, నవంబర్ 6: బీఆర్ఎస్ ఎన్నికల ప్రచారానికి కొన్ని రోజులుగా దూరంగా ఉంటున్న ఉప్పల్ ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి సోమవారం ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతు పలికారు. ఆయన గెలుపులో భాగస్వామిని అవుతానని ప్రకటించారు. వీరిద్దరి కలయిక పార్టీ శ్రేణుల్లో జోష్ నింపింది. విషయం తెలిసిన కార్యకర్తలు ఎమ్మెల్యే నివాసానికి పెద్ద ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే హబ్సిగూడలోని తన నివాసంలో మీడియాతో మాట్లాడుతూ.. తండ్రిలాంటి సీఎం కేసీఆర్ మాటకు కట్టుబడి పార్టీ అభ్యర్థి గెలుపునకు కృషి చేస్తానని చెప్పారు. ఎమ్మెల్యే టికెట్ దక్కకపోవడంతో కొంత బాధపడిన వాస్తవమేనని, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు మాట్లాడి తనకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. పార్టీ మార్పు వార్తల్లో నిజం లేదని కొట్టిపడేశారు. కలిసికట్టుగా పనిచేసి బండారిని గెలిపించుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఉప్పల్ ఎన్నికల ఇంచార్జి రావుల శ్రీధర్‌రెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ శ్రేణులు, సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



ఉప్పల్ బీఆర్ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డికి మద్దతు ప్రకటిస్తున్న స్థానిక ఎమ్మెల్యే బేతి సుభాష్‌రెడ్డి, చిత్రంలో రావుల శ్రీధర్‌రెడ్డి తదితరులు

ప్రజాశీర్వాదంతో మళ్లీ గెలుస్తా

- గోదావరి జలాలతో చెరువులు నింపా
- మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వెల్లడి
- పాలకుర్తిలో నామినేషన్ దాఖలు
- 10న మరోసారి వేస్తానన్న ఎర్రబెల్లి

దేవరుప్పుల/పాలకుర్తి రూరల్, నవంబర్ 6: ప్రజల ఆశీర్వాదంతో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా గెలిచానని, సీఎం కేసీఆర్ దీవెనలు, ప్రజాబలంతో మరోసారి విజయం సాధిస్తానని పంచాయతీరాజ్‌శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ధీమా వ్యక్తం చేశారు. సోమవారం నామినేషన్ పత్రాలతో ఆలయాల్లో పూజలు, చర్చి, మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం జనగామ జిల్లా పాలకుర్తిలో నామినేషన్ దాఖలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి ఎర్రబెల్లి మాట్లాడుతూ.. ఈ నెల 10న రెండో సెట్ నామినేషన్ దాఖలు చేస్తానని, దానికి మంత్రులు హరీశ్‌రావు, సత్యవతి రాథోడ్ తదితరులు హాజరవుతారని చెప్పారు. 14న తొర్రూరులో కేసీఆర్ సభ ఉంటుందని తెలిపారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చేసిన తనను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు. సీఎం కేసీఆర్ సహకారంతో గోదావరి జలాలతో చెరువులు నింపానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకుడు రామసహాయం కృష్ణకిషోర్‌రెడ్డి, జీసీసీ మాజీ చైర్మన్ ధరావత్ గాంధీనాయక్, ఎంపీపీ నల్లా నాగిరెడ్డి, జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పాలకుర్తి ఆర్వో కార్యాలయంలో మొదటి సెట్ నామినేషన్ దాఖలు చేస్తున్న మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు